ప్రజాశక్తి

ఆదివారం 24 నవంబర్ 2024 5 అనంతపురం

అంతా సమీప బంధువులే..
ఎల్లుట్లలో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారంతా సమీప బంధువులే.. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు. అందరూ కలిసి రోజూ కూలి పనులకెళ్లి వచ్చి పూట గడుపుకుంటూ ఉంటారు. ఎప్పటిలాగానే శనివారం ఉదయం తమ గ్రామం నుంచి 50 కిలోమీటర్ల దూరంలోనున్న గార్లదిన్నె మండలం కలగాసుపల్లికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లారు. అరటి చెట్లకు ఎరువులు వేసే పనికోసం వెళ్లి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైన సమయంలో వారు ప్రయాణిస్తున్న ఆటోకి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృత్యువాతపడ్డారు. దీంతో ఎల్లుట్లలోని దళితవాడలో విషాదఛాయలు అమలుముకున్నాయి.

దంపతులు మృతి... అనాథగా మిగిలిన కూతురు

ఆటో ప్రమాదంలో మృతి చెందిన చిన్న నాగన్న, చిన్న నాగమ్మ ఇద్దరూ ఒకేసారి మృతి చెందారు. భార్యాభర్తలు ఇద్దరూ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లినప్పుడు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలుండగా ఒకరికి వివాహమైంది. మరో కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇప్పుడు తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో ఆమెకు అనాథగా మారింది.

వెళ్లొస్తానని చెప్పి వెళ్లిపోతివా..!

నీవు ఇండికాడే ఉండు... నేను వెళ్లొస్తానని చెప్పిపోతివే... అంటూ జయరాముడు భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఎప్పుడు ఇద్దరూ కలిసి పనికెళ్లేవారు... కాని శనివారం ఉదయం భార్యను వద్దని జయరాముడు మాత్రమే పనికెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. జయరాముడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ కడా ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

వారంతా వ్యవసాయ కూలీలు. కుటుంబం అంతా కూలి పనులకు వెళ్తేనే జీవనం గడిచేది. మండేకడుపు నింపుకోవాలంటే కూలి పనులకు వెళ్లాల్సిందే. సొంతూరులో పనులు లేక పక్కగ్రామాలకు కూలి పనులకు వెళ్తుంటారు. ఇంటి పెద్దకు తోడుగా పనికెళ్తే నాలుగు పైసలొస్తాయని భార్యాభర్తలిద్దరూ పనులకు వెళ్తుంటారు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని సాగించే పేద కూలీల జీవన పోరాటంలో పెనుప్రమాదం చీకట్లను నింపింది. ఊహించని పరిణామం క్షణకాలంలో ఇంట మృత్యుఘోషను మోగించింది. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న వారికి అదే చివరి రోజు అయ్యింది. మరికొంత సేపట్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా మృత్యుపాశానికి ఎనిమిది మంది కూలీలు బలయ్యారు. శనివారం నాడు గార్లదిన్నె మండలం తలగాసిపల్లి ఎన్‌హెచ్-44పై ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదం పేద కూలీల ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది.

తల్లిని కోల్పోయి సర్వజన ఆసుపత్రి వద్ద రోధిస్తున్న బాలిక

కూలీల ఇంట.. మృత్యుఘోష

ఘటనా స్థలంలో మృతి చెందిన మహిళలు

- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మృతులంతా దళితులు, బంధువులు
- కూలీల ఇంట పెను విషాదం
- కన్నీటి సంద్రమైన ఎల్లుట్ల దళితవాడ
- సర్వజనాసుపత్రిలో మిన్నంటిన రోదనలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గార్లదిన్నె, పుట్లూరు

అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 13మంది కూలి పనుల నిమిత్తం గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామంలో అరటి పిలకలకు మందు పిచికారీ చేసేందుకు సోమవారం ఉదయం ఆటోలో వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని కూలీలు బాలపెద్దయ్య(50), డి.నాగమ్మ(45), బి.నాగమ్మ(50), డి.రామాంజినమ్మ(42), చిన్న నాగన్న(52), కొండమ్మ(48), జయరాముడు(40), ఈశ్వరయ్య(55)తోపాటు మరో ముగ్గురు వెళ్లిన ఆటోలోనే స్వగ్రామానికి బయల్దేరారు. గార్లదిన్నె మీదుగా నార్పలకు వెళ్తుండగా తలగాసిపల్లి గ్రామం వద్ద ఆటో ఎన్‌హెచ్-44పైకి ఎక్కింది. ఇదే సమయంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలో బాల పెద్దయ్య, డి.నాగమ్మ, బి.నాగమ్మలు మరణించారు. మిగిలిన పది మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులు, 108కు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డి.రామాంజినమ్మ, చిన్ననాగన్న, కొండమ్మ, జయరాముడు, ఈశ్వరయ్య మరణించారు. గంగాధర, రామాంజినమ్మ, సెద్దులమ్మ, లక్ష్మీదేవి, ఆటోడ్రైవర్ నీలకంఠలు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.

ప్రమాదానికి కారణం అయిన ఆర్టీసీ బస్సు

మృతలంతా పేద కూలీలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి కూలీలంతా దళిత పేద కూలీలు. ప్రతి రోజూ ఉదయాన్నే కుటుంబం అంతా కూలి పనులకు వెళ్తాంటారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. ప్రస్తుతం ప్రమాదంలో మరణించిన వారిలో చిన్న నాగన్న, బి.నాగమ్మలు భార్యాభర్తలు. మిగిలిన వారు కూడా బంధువులు. ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువులు ఇలా ఒకే రోజు మరణిచండంతో ఎల్లుట్ల దళిత వాడలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్రమాదంలో దెబ్బ తిన్న ఆటో

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

బాధిత కుటుంబాలకు సిఐటియు, వ్యకాస పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన బాధిత కుటుంబ సభ్యులను అనంతపురం సర్వజనాసుపత్రిలో సిపిఎం, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకునే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు స్థానికంగా పనులు లేక ఇతర గ్రామాలకు వెళ్తా తరుచూ ఇలా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ప్రతి గ్రామంలోనూ విరివిగా ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం చేసి స్థానికంగా పనులు కల్పించి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు కూలీలు మృతి చెందిన ఘటనపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమైనదన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. అధికారులు బాధితులకు అండగా నిలిచి, వారికి సరైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్, ఎస్పీ పరిశీలన

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కడప ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, అనంతపురం ఎస్పీ పి.జగదీష్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులను ఆదుకుంటామని, గాయాపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా అన్ని చర్యలూ తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలియజేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి : సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

'గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు మరణించడం అత్యంత విచారకరం. కూలి పనుల కోసం ఆటోలో వెళ్తున్న వారిని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఒకే సారి ఇంత మంది మరణించడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి. మరణంచిన ఒక్కొక్క కూలీకి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా చూడాలి'.

బాధితులకు సహకారం అందిస్తాం
కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలతోపాటు, గాయపడినవారికి సహాయ సహకారాలు అందిస్తాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మృతులకు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించింది. గాయపడిన వారిలో ఒకరికి సీరియస్ ఉండగా కిమ్స్ సవేరా ఆసుపత్రికి తరలించాం. ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించాం. రోడ్డు ప్రమాదాల నివారణకు తగ్గిన చర్యలు చేపడతాం.

ప్రభుత్వం అండగా ఉంటుంది.. : ఎంపీ అంబికా

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతులకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు నష్ట పరిహారాన్ని అందించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స కోసం అవసరమైన తోడ్పాటును అందిస్తుంది.

సంబరంగా సత్యసాయి జయంత్యుత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- పాల్గొన్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎమ్మెల్యేలు
- సత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయం :గవర్నర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు పుట్టపర్తిలో సంబరంగా జరిగాయి. దేశ, విదేశాలకు చెందిన భక్తులు, పర్యాటకులు వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి విచ్చేశారు. భక్తులతో సాయి కుల్వంత్‌హాల్ కిటకిటలాడింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈయనతో పాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, సత్యసాయి ట్రస్ట్ అధికారి రత్నాకర్, హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి విద్యార్థులు, భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. భక్తుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జయంత్యుత్సవాల సందర్భంగా పలువురు ప్రముఖులు బాబా సమాధిని దర్శించుకున్నారు.

ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సత్యసాయి బాబా మహాసమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న గవర్నర్, ట్రస్టు సభ్యులు, మంత్రి

సత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయం
రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

శ్రీసత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. బాబా జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా బాబా సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. సత్యసాయి బాబా భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ లక్షలాది మందిని సేవా మార్గంలో చైతన్యపరిచారన్నారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రస్తుతం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమం, విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ, తాగునీరు, వైద్యం ఇలా అనేక సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తూ బాబా సేవలను విశ్వవ్యాప్తం చేస్తుండడం గర్వకారణం అన్నారు. సత్యసాయి బాబా మార్గదర్శకత్వంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన విద్య, ఆరోగ్య సంరక్షణ, సురక్షితమైన తాగునీటిని అందించడం తదితర సేవా కార్యక్రమాలు భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా మానవాళిపై గొప్ప ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. బాబా స్థాపించిన శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ 120 కంటే ఎక్కువ దేశాల్లో ఉంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం గొప్ప కార్యక్రమం అన్నారు. 'శ్రీ సత్యసాయి పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేయడం ఆయనకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి నాగానంద్, నిమిస్ పాండ్యా, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

గవర్నర్‌కు వీడ్కోలు

సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్‌కు కలెక్టర్ టిఎస్.చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోసీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎస్పీ వి.రత్న, ఎఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ధర్మవరం ఆర్డీవో మహేష్, పుట్టపర్తి తహశీల్దార్ అనుపమ, ఇతర వీడ్కోలు పలికారు. రోడ్డు మార్గం ద్వారా ఆయన బెంగుళూరుకు వెళ్లారు.

పుట్టపర్తిలో సందడి

సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి బాబా భక్తులు శనివారం వేకువజాము నుంచే బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. జయంతి సందర్భంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. బాబా చిత్రపటాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వద్ద, సత్యసాయి భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయి భక్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసు, ఆర్టీసీ, మునిసిపల్ తదతర అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరి పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో 2025-26వ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి తర్వాత ఇంటర్ తమ కళాశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులు, విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.5,500 అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిఇఒ, ఆర్‌ఐఒ కార్యాలయాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, వంశీ, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, సూర్యప్రకాష్, రజిత, భీమేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి
ఆర్టీసీ సంస్థ ఛైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న పూల నాగరాజు

ఆర్టీసీ ప్రయాణికులకు మురుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు సూచించారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జోన్ పరిధిలోని సమస్యలు, ఆర్థిక అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలి, మెరుగైన సేవలు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపైన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్టాండ్‌లో మహిళల కోసం కేటాయించిన మరుగుదొడల్ల నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనతంరం నాగరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని, శ్రీ సత్యసాయి జిల్లా డిపిటిఓ మధుసూదన్, సిటిఎం కె.శ్రీలక్ష్మి, డిప్యూటీ సిఎంఇ రమేష్‌బాబు, డిఇఇ సురేంద్రబాబు, ఉమ్మడి అనంతపురం జిల్లా డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి-గుంతకల్లు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యుటిఎఫ్‌ను స్థాపించారన్నారు. కావున 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. 50ఏళ్లలో యుటిఎఫ్ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కావున వచ్చే జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో నిర్వహించనున్న స్వర్ణోత్సవాలకు గుంతకల్లు నుంచి భారీగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రామప్పచౌదరి, నాయకులు రాజ్‌కుమార్, విశ్వనాథ్ కల్పన, పావన మురళి, శంకరయ్య, మల్లికార్జున, యల్లన్న రమేష్, రఫీ, రేవన సిద్ధయ్య, సుధాకర్, వెంకటేష్, ఖలీల్, చిరంజీవి, పెన్నయ్య, విశాలాక్షి, జయదుర్గ, లావణ్య, శంకర్‌నాయక్, చిన్నరంగన్న, నిర్మల్, చలపతి, పెన్నయ్య, చంద్రారావు, గురునాథ్, భాస్కర్, విశ్వేశ్వర్‌బాబు, మోహన్‌బాబు, రాజకుమార్, చంద్రమౌళి, చంద్రశేఖర్, అశోక్‌కుమార్, రాంబాబు, రామచంద్రనాయక్, దాసునాయక్, మల్లేశ్వరి, శైలజ, వెంకటేశులు, గిరిబాబు, శంకర్‌నాయక్, మంగమ్మ, మాధవి, పద్మావతి, భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి
జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు సాగు చేసిన పంటలకు ఈనెల 15వతేదీలోపు బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో ఉరవకొండ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, ఎఒలు శుభకర్, పెన్నయ్య, మధుకర్, స్వాతి, ఎఇఒ రాఘవేంద్ర, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి
www.prajasakti.com

'అపార్' పేరుతో దోపిడీని అరికట్టాలి

అదనంగా ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ నమోదకు ఏర్పడుతున్న ఇబ్బందులను కొందరు ఆసరాగా చేసుకుని దోచుకుంటున్నారన్నారు. విద్యార్థుల పుట్టిన సర్టిఫికెట్, పేర్ల సవరణ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.2వేలకు పైగా వసూలు చేస్తున్నారన్నారు. మరికొందరు తల్లిదండ్రులు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హిరణ్య, నాయకులు సాయి, ప్రవీణ్, చరణ్, మల్లి, శివ, చిరు, నాని, ఛత్రపతి, ముజీఫ్, కిరణ్, అనిల్, భాస్కర్, ఆది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతుసంఘం నాయకులు చిన్న మట్లగొంది కోరే శ్రీనివాసులుయాదవ్, మండల కార్యదర్శి ఇరువెందుల కొండారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ప్రమాదంలో ఏడుగురు మృతిచెంది, ఆరుగురు గాయపడటం బాధాకరమన్నారు. వీరందరూ కూలి పనులు చేసుకుని జీవించేవారన్నారు. కావున ఒక్కో కుటుంబానికి రూ.50లక్షలు పరిహారం అందించడంతోపాటు మూడెకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

పుట్లూరు : గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల అధ్యక్షులు సూరి, నాయకులు నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన దళిత కూలీలు ఏడుగురు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. వెంటనే బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కాగా రోడ్డు ప్రమాద ఘటనపై టిడిపి నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో సిఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన సిఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బి.రమేష్ అంత్యక్రియలను శనివారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. బి.రమేష్ హైదరాబాద్ 3వ బెటాలియన్‌లో సిఆర్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. మృతదేహాన్ని స్వగ్రామం కొనకొండ్లకు శనివారం తీసుకొచ్చారు. దీంతో ఎస్పీ జగదీష్, గుంతకల్లు ఎస్‌డిపిఒ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉరవకొండ రూరల్ సిఐ చిన్నగౌస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. రమేష్ అంతిమ యాత్రలో వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి పాడె మోశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ ఇన్స్‌పెక్టర్ ఎంవి.కృష్ణయ్య, మతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

గేట్స్ విద్యార్థినికి బంగారు పతకం

బంగారు పతకం సాధించిన విద్యార్థిని

ప్రజాశక్తి-గుత్తి

ఐఐటి ఖరగ్పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికేషన్ కోర్స్ పరీక్షల్లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఉప్పల లక్ష్మి చైతన్య ఉత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. కేంద్ర విద్యాశాఖ నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్ హన్స్ డ్ లెర్నింగ్ (ఎన్ పిటిఇఎల్) యూనివర్సిటీ స్థాయి, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ సబ్జెక్టుల కొరకు జాతీయ లెర్నింగ్ వేదికైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా నిర్వహించే జాతీయస్థాయి పరీక్షలను ఐఐటి ఖరగ్పూర్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగాయి. ఇందులో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం సైబర్ సెక్యూరిటీ చదువుతున్న ఉప్పల లక్ష్మీచైతన్య 'ఇంట్రడక్షన్ టు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' అనే కోర్సులో అత్యుత్తమ ప్రతిభ చూపి 94 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. దీంతో ఆ విద్యార్థినికి ఐఐటి ఖరగ్పూర్ గోల్డ్ మెడల్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఘనత తమ కళాశాల విద్యార్థిని నిరంతర కృషి, అధ్యాపకుల అంకితభావం వల్లే సాధ్యమైందని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ రఘునాథరెడ్డి అన్నారు. కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఇంచార్జ్ తేజ, తదితరులు బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందించారు.

నేడు కనకదాస విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని బీరప్ప కూడలిలో ఆదివారం నిర్వహించనున్న భక్త కనకదాస కాంస్య విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కె.సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి భవానీ మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని గుంతకల్లప్ప స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ సందర్భంగా ఉదయం ర్యాలీ మైదానం నుంచి ఎన్టీఆర్ కూడలి మీదుగా బీరప్ప స్వామి ఆలయ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఎస్.సవితమ్మ, హిందూపురం ఎంపి బికె.పార్థసారథితోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కావున కురుబ కులస్తులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కురుబ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కె.చంద్రశేఖర్, సంఘం నాయకులు కౌన్సిలర్ లింగన్న, జిడ్డిపేట కదిరప్ప, రాణాప్రతాప్, లింగన్న గౌడ్, శివప్ప, సురేష్, జిసిరెడ్డి పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఆకుల బాబు

ప్రజాశక్తి-నార్పల

శాసనసభ సమావేశాల సందర్భంగా అమరావతిలో ఉప ముఖ్యమంత్రితోపాటు పలువురు మంత్రులను మండలానికి చెందిన టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీరితోపాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, యువ నాయకులు పరిటాల శ్రీరామ్, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు.

లోకేష్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఆకుల బాబు

మహిళల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-పామిడి

మహిళల ఆర్థ్యున్నతికి చేయూత అందిస్తున్నట్లు వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. శనివారం మండలంలోని గజరాంపల్లి గ్రామంలో ఉన్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమను గార్లదిన్నె ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు, ఇంటర్మీడియట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. ఇందులో భాగంగా పరిశ్రమలో ఉన్న మిషన్లు, మిషనరీలు, బరన్ సెక్షన్, క్వాలిటీ సెక్షన్, భోజనం చేయడానికి క్యాంటీన్ తదితర వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు చేయూతనందించాలన్న ఉద్దేశంతోనే పెరుమాళ్ల జీవానందరెడ్డి పరిశ్రమను స్థాపించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాకే సతీష్, ఉపాధ్యాయులు ఒకేషనల్ నరసింహమూర్తి, టీచర్స్ అరుంధతి, ప్రొడక్షన్ మేనేజర్ అశోక్, అకౌంటెంట్ పవన్, క్వాలిటీ ఇన్‌ఛార్జ్ నారాయణ, మెకానిక్ బాషా, క్వాలిటీ మేనేజర్ చిదానంద, రిసెప్షన్ అప్పన్న, సుధాకర్, రంగ, సుధ, వెంకటేష్, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

26న మహాధర్నాను విజయవంతం చేయాలి

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బాలరంగయ్య

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం, కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతాంగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల26న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బాలరంగయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం విడపనకల్లు మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు ఉన్న ప్రతి కౌలు రైతుకూ ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నారు. పంట నష్టపరిహారం బీమా చెల్లించాలని, రైతులకు కనీస మద్దతు ధర చట్టం తేవాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేసి, వ్యవసాయ మోటార్లకు గృహ వినియోగానికి ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సరిపడ నికరజలాలు కేటాయించి శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని, హంద్రీనీవా,హెచ్చెల్సీ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఖరీఫ్, రబీ పంటల బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శులు ఎ.రంగారెడ్డి, జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేశులు, అశ్వర్థ, సిఐటియు హామాలీలు వరదరాజు, సురేష్, మైలారి, నాగరాజ్, వెంకటేశులు, రైతులు, కౌలు రైతులు ఎర్రప్ప, మల్లికార్జున, రంగప్ప, జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ విమర్శించారు. శనివారం ఎపి, రైతు, కార్మిక, ప్రజాసంఘాల తాడిపత్రి తాలుకా సమన్వయ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బషీర్‌అహ్మద్, సిపిఐ సీనియర్ నాయకులు వై.సూర్యనారాయణరెడ్డి, నీలూరు లక్ష్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడుయాదవ్, ముస్లిం మైనారిటీ నాయకులు జూటూరు మహమ్మద్ రఫీ, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య, నారాయణస్వామి, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నరసింహా, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : రైతాంగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల26న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి వెంకట్‌చౌదరి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం మండలంలో రైతులు, కూలీలతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సిపిఎం నాయకులు పెద్దయ్య, కుళ్లాయప్ప, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, జె.పెద్దయ్య, ఆదినారాయణ, రైతులు నాగప్ప, నరసింహుడు, పుల్లయ్య, రామాంజి, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అదానీని అరెస్టు చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

దేశంతోపాటు రాష్ట్ర సంపదను లూటీ చేసిన పారిశ్రామికవేత్త అదానీని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీకి అత్యంత సన్నిహితుడైన ఆదాని సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులకు భారీ ఎత్తున ముడుపులు అప్పజెప్పినట్లు వస్తున్న వార్తలపై ప్రధాని స్పందించాలన్నారు. అదానీ అవినీతి సామ్రాజ్యం వెనుక ప్రధానీ మోదీ అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో నిందితుడైన అదానీతో గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్, స్మార్ట్ మీటర్లు, ఇతర ఒప్పందాలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా సర్దుబాటు ఛార్జీల భారాలతోపాటు, స్మార్ట్ మీటర్ల ఒప్పందలన్నింటినీ రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో అదానీ సంస్థకు కేటాయించిన భూములు, ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలని, అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆదానిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదానీతో లంచాలు తీసుకున్న అవినీతిపరుల పేర్లు, వివరాలను అమెరికా ప్రభుత్వం నుంచి పొందటానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు వివరించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుత్తి

చదువు లేనిది జీవితం లేదని, విద్యతోనే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, సిఇఒ ఎ.శ్రీరాములు ఆధ్వర్యంలో కాలేజీ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, సిఇఒ ఎ.శ్రీరాములు, పిఆర్ఆర్ ఎంబిఎకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యను తప్పనిసరిగా అభ్యసించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదవాలని సూచించారు. ఈ సందర్భంగా సిఐ బి.వెంకటేశ్వర్లు ను శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సినిమా పాటలు విద్యార్థులు చేసిన డాన్సులు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్ : శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శనివారం దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తర్వాత వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలల్లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్టింగ్ ఆఫీసర్ ఎన్.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 135 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఓటరు నమోదుకు 72, తొలగింపులకు 20, సవరణలకు 33, పోలింగ్ కేంద్రం మార్పునకు 10 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహశీల్దార్ మునివేలు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఓటరుగా నమోదు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సురేంద్ర, టిడిపి నాయకుడు అనిల్‌కుమార్, విఆర్ఎలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే సోమవారం పట్టణంలోని ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించనున్న గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరుకానున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వచ్చి కలెక్టర్‌కు విన్నవించుకోవాలని కోరారు.

దండు శ్రీనివాసులును కలిసిన నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

దండు శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు

ప్రజాశక్తి-శింగనమల

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండ శ్రీనివాసులును అనంతపురంలోని స్వగృహంలో ఎపి నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు పదవి వచ్చేందుకు సహకరించినందుకు కృతజ్ఞత తెలుపుతూ దండు శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ నాయీబ్రాహ్మణ సహకార కమిటీ సభ్యులు వెంకటప్ప, తాడిమర్రి సురేంద్ర, వెంకట, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఉరవకొండ

భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని ఉరవకొండలోని స్వామి అవతారాన్ని ప్రకటించిన క్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి గురు చరణ భజన మందిరంలో భజన చేశారు. అనంతరం స్వామి జన్మ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. మహా మంగళహారతి ప్రసాద వినియోగంతో కార్యక్రమం ముగిసింది.

దోమల నివారణకు చర్యలు

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ రమేష్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర తెలిపారు. దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రం ఉంచుకుంటే రోగాలు దరి చేవరన్నారు. కావున ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి ఇళ్లలోని నీటిని పారబోయాలన్నారు. అలాగే ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మంజుల, సూర్యనారాయణ, ఆశా కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

చెమ్మనూరు క్రెడిట్ సొసైటీ బ్రాంచి ప్రారంభం

బ్రాంచిని ప్రారంభిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని గుత్తిరోడ్డు వేణుగోపాల్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చెమ్మనూరు క్రెడిట్, ఇన్వెస్ట్‌మెంట్ వారి 305వ శాఖను జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ బంగారు ఆభరణాలపై అందుబాటు వడ్డీ ధరలతో అవసరం ఉన్న వారికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ జోనల్ మేనేజర్ బాలాజీసింగ్, ఏరియా మేనేజర్ వంశీకృష్ణ, విజిలెన్స్ ఆఫీసర్ ప్రతాప్, బ్రాంచి మేనేజర్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ యముడు, చిత్రగుప్త పాత్రలు ధరించి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగింది. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్‌కుమార్, డీన్ తిప్పారెడ్డి, ఇన్‌ఛార్జి లీలావతి, హేమలత, పిఇటి అశోక్, హరి, యముని పాత్రధారి తెలుగు ఉపాధ్యాయుడు మారెప్ప, డ్యాన్స్ మాస్టర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి : ఎంపిడిఒ

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇంటింటి జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ దాస్‌నాయక్ సూచించారు. శనివారం మండలంలోని గోవిందవాడ, దర్గా హొన్నూర్ సచివాలయాలను ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వేపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పక్కాగా సర్వే చేయాలన్నారు. ఎలాంటి అవకతవలకు తావివ్వొద్దన్నారు. అంతేగాకుండా సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ పంచాయతీ కార్యదర్శి వెంకటేశులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఒ గంగావతి, ఎంఇఒ నారపరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా భోజన నాణ్యతపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ భోజనం వండే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజనం నాణ్యతలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం చేయడానికి సమయం చాలా పడుతుందన్నారు. కావున భోజనం వడ్డించడానికి రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపోతే పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్‌ను ఎంపిడిఒ పరిశీలించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్ : నగర సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సెట్ సంస్థలో నిరుద్యోగులకు కారు డ్రైవింగ్, ఎలక్ట్రీషన్, సెల్‌ఫోన్ మెకానిజంపై నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్..94409 05479, 08554-255925 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పెను విషాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఈ వారంలో పలు పెనువిషాదాలు చోటు చేసుకున్నాయి. శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదం అతి పెద్ద దుర్ఘటన కాగా, అంతక మునుపు విద్యుత్ తీగలు తెగిపడి తండ్రీకుమారుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇక నార్పలలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా ఈవారంలో అనేక దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. యల్లనూరు మండలం దంతలపల్లి గ్రామానికి చెందిన తండ్రీకుమారుడు మోటర్ సైకిల్‌పై పోతున్న సమయంలో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్‌ఘాతానికి గురై చనిపోవడం జరిగింది. ఇటువంటి ఘటనలు జిల్లాలో గతంలోనూ చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఒక్కటే 103 మంది విద్యుత్‌ఘాతానికి గురై చనిపోవడం జరిగింది. ఇవి గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. తాడిమర్రి మండలంలో ఆటోపై విద్యుత్ తీగలు తెగిపడి వ్యవసాయ కూలీలు చనిపోవడం సంచలనం రేపింది. ఈ ఘటనలకు గల కారణాలను అప్పట్లో అన్వేషించారు. విద్యుత్ శాఖలో ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉంది. కీలకమైన లైన్‌మెన్ల కొరత ఈ ప్రమాదాలకు చాలా వరకు కారణమవుతోంది. అయితే ప్రభుత్వాలు మారుతున్న ఈ సమస్యలపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. సామాన్యుల ప్రాణాలు మాత్రం గాల్లో కలసిపోతున్నాయి ఇక శనివారం నాడు ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు వ్యవసాయ కూలీలు మృత్యుతవాడ్డారు. అంతా వ్యవసాయ కార్మికులే. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలే. పెద్ద దిక్కుగానున్న వారు చనిపోతే ఆ కుటుంబాలు నిరాశ్రయంగా మారుతున్నాయి. ఈ రకంగా వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన గతంలో గార్లదిన్నెలోనూ చోటు చేసుకుంది. అప్పుడు ఇటువంటి పరామర్శలే వచ్చాయి. అయితే ఆ తరువాత పట్టించుకునే వారులేక ఆ కుటుంబాలు ఇప్పటికీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా క్షతగాత్రులుగానున్న వారి కుటుంబాలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. రోడ్డు ప్రమాదాలశ్రీను నివారిస్తామని ఇటీవలనే జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చర్చించింది. బ్లాక్‌స్పాట్‌ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే ఈ ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఏటా 500 మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. నార్పలలో రుణభారంతో భార్య, భర్త, కుమార్తె ముగ్గురు ఒకేసారి చనిపోవడం పెద్ద చర్చనీయాంశమమైంది. కొవిడ్ సమయం నుంచి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఈ ఆర్థిక ఇబ్బందులు ఇప్పటికీ వ్యాపారులను వెన్నాడుతూనే ఉన్నాయి. నార్పలలో ఆత్మహత్య చేసుకున్న కుటుంబం కూడా వ్యాపారం చేసుకునే కావడం గమనార్హం. ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వారంలో వరుసగా మూడు ప్రధాన దుర్ఘటనలు జిల్లాలో జరిగాయి. ఇక ప్రధానమైన ఘటనల్లో సత్యసాయి జిల్లాలో సత్యసాయి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలను రాష్ట్ర గవర్నర్ నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు. వారం రోజులుగా సత్యసాయి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా ప్రజల దాహార్తి తీర్చిన నిజ దేవుడు సత్యసాయి బాబా అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి రవీంద్రారెడ్డి, సోమశేఖర్‌నాయుడు, హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సత్యసాయి పంప్‌హౌస్‌లో సత్యసాయి బాబా జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఒ లక్ష్మీనరసింహా, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని మడ్డిపల్లి, తక్కల్లపల్లి సచివాలయాలను ఎంపిడిఒ అలివేలమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం 10 గంటల్లోపు బయోమెట్రిక్ వేయాలని సూచించారు. తర్వాత ఎన్‌పిసిఐ, ఇంటింటి జియో ట్యాగింగ్ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీలో టిడిపి యువ నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కదిరెప్ప మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్లాంపూర్ కాలనీ మైనార్టీ యువత, మహిళలు పాల్గొన్నారు.

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని అనుంపల్లి గ్రామంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముంటిమడుగు సుంకప్ప, పల్లె శ్రీనివాసులు, వడ్డే రామాంజినేయులు, భాస్కర్‌యాదవ్, ఆవుల ఓబులేసు, కరూరు సుంకప్ప, తలారి ముని, కంచం సుంకయ్య, శివ, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ అందించాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కార్డుదారులకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహశీల్దార్ మునివేలు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ ఆధ్వర్యంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్‌కార్డు దారుడికీ ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను అందజేయాలన్నారు. ఇందులో ఎలాంటి అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ బాలకృష్ణ, వీఆర్వోలు, డీలర్ల సంఘం అధ్యక్షుడు పయ్యావుల మోహన్, ఉపాధ్యక్షుడు మైలపురం తిప్పేస్వామి, కమిటీ మెంబర్లు ఆనంద్, డీలర్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ఆర్‌డిటి స్టేడియం వద్ద అనంతపురం-కళ్యాణదుర్గం ప్రధాన రహదారిపై ఎన్నోఏళ్లుగా ఉన్న డ్రెయినేజీ సమస్యలను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు శనివారం పరిష్కరించారు. ఇందులో భాగంగా అధికారులు, ప్రజలతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎగ్గడి వరలక్ష్మి, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివకుమార్, ఇఒఆర్‌డి కామాక్షి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సర్వేయర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి మహిళలు

మహిళలకు మంత్రి సవిత క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి -అనంతపురం

మాజీ సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి సవితమ్మ వెంటనే క్షమాపణ చెప్పాలని వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం జగన్ రాష్ట్రంలోని మహిళలను మత్తు, గంజాయికి అలవాటు చేశారని మంత్రి సవిత శాసనమండలిలో చెప్పడం బాధాకరమన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రంలోని రెండు కోట్ల మంది మహిళలను అవమానించడమే అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మహిళల నుంచి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సాకే రమేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్డి వినియోగంపై ప్రత్యేక క్యాంపు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మరుగుదొడ్ల వినియోగంపై ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు సర్పంచి వనిత మల్లికార్జున తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని సంతే కొండాపురంలో మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లలిత, సచివాలయ సిబ్బంది సంధ్య, వినోదమ్మ, ప్రియాంక, ముజాహిద్, అభిషేక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులేసు, టిడిపి నాయకులు పెంకుల మల్లికార్జున, వార్డుసభ్యులు లక్ష్మన్న, నరసింహులు, డీలర్ చెన్నమల్ల, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఉపాధి హామీ చట్టంలో కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంబాషా సూచించారు. శనివారం మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా కూలీల సంఖ్య పెంచడంతోపాటు రోజు కూలి రూ.300కు తగ్గకుండా వేతనం వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిడి శైలజ, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, ఎపిఒ సూర్యప్రకాష్, మురళీకృష్ణ, టిడిపి ప్రధాన కార్యదర్శి బి.మల్లికార్జున, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శింగనమల : మండల పరిధిలోని పెద్దజలాలపురం వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పెద్ద జలాలపురం వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన అహుడా ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం - హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా టిసి వరుణ్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అహుడా ఛైర్మన్‌గా నియమితులపై టిసి.వరుణ్‌కు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఇండ్లే కిరణ్‌కుమార్, నాయకులు శ్రీకృష్ణచైతన్య పాల్గొన్నారు.

ఎస్పీ పి.జగదీష్‌కు బొకే అందజేస్తున్న అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్

శ్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలి

జెసికి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బిసిఆర్.దాస్ విజ్ఞప్తి చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీలకు చనిపోతే పూడ్చేందుకు స్థలాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించడంతోపాటు శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎన్‌ఎన్.కుంట సూరి, జెసి శేఖర్, దొడ్డప్ప, శివ, రాము, తదితరులు పాల్గొన్నారు.

జెసి శివ్‌నారాయణ్‌శర్మకు బొకే అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

చీడపీడలను నివారిస్తే అధిక దిగుబడులు

జిల్లా వనరుల కేంద్రం పీడీ మద్దిలేటి

ప్రజాశక్తి-ఉరవకొండ

చీడపీడలను నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం పీడీ మద్దిలేటి సూచించారు. శనివారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఉరవకొండ డివిజన్ రైతు సేవాకేంద్రం సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని రైతు సేవాకేంద్ర సిబ్బందికి రైతులు సాగు చేసిన పొలాల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శైలజాకుమారి, ఎఒ శ్రీనివాసులు, ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, ఉరవకొండ డివిజన్ ఎఒలు శుభకర్, పెన్నయ్య, మధుకర్ స్వాతి, ఎఇఒ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు వరద బాధితుల విరాళం చెక్కులు అందజేత

ప్రజాశక్తి-రాయదుర్గం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గంలోని మహిళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సేకరించిన చెకుకలను సిఎం చంద్రబాబుకు శనివారం అమరావతిలో అందజేశారు. ఈమేరకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి రూ.9లక్షల చెక్కును చంద్రబాబుకు అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్ హెచ్ గంగాధర్, ఏరియా కోఆర్డినేటర్ ఇన్‌ఛార్జి గోవిందప్ప, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పావతి (రాయదుర్గం), లక్ష్మీదేవి (గుమ్మగట్ట), గంగమ్మ (బొమ్మనహాల్), వనజమ్మ (కణేకల్), తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ఎగువ కాలువ అభివృద్ధికి నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ, ఉంతకల్లు రిజర్వాయర్ ఏర్పాటు సమగ్ర సర్వే నివేదిక రూపకల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణకు రూ.35 కోట్లతోపాటు ఉంతకల్లు బాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు డిపిఆర్ రూపకల్పనకు సీఎం నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. ఇందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

ప్రజాశక్తి-పుట్లూరు

సహాయ గణాంక అధికారి విజయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి సూర్య హరిబాబు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎఎస్ఒ విజయకుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌భీమా యోజన పథకంలో భాగంగా విలేజ్ బీమా పథకం కింద ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటల్లో పంటకోత ప్రయోగాలు ఎలా చేయాలనే అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ భార్గవి, నాగమణి, విహెచ్ఎ ఆదినారాయణ, రామలక్ష్మి, మనోరమ, మురళి, ప్రవీణ్, అజయ్, రవితేజ, విఎస్ఎ సర్ఫరాజ్, ఎంపిఇఒలు సుమతి, సుధ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సహాయ గణాంక అధికారి విజయ్‌కుమార్